క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



క్యాన్సర్‌పై అవగాహన చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాదరావు

గుర్ల: క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని కోటగండ్రేడు సచివాలయం వద్ద క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలు చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్‌లకు దూరంగా ఉండాలన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పేషెంట్లకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీధర్, సర్పంచ్ ముదాడ ప్రసన్నకుమారి, ఎంపీటీసీ ఉబ్బిశెట్టి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సమీక్షలు

గుర్ల: మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఉమాశంకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ప్రతీ నెలా నిర్వహించే మండల సమావేశాలకు అధికారులు గైర్హాజరవుతుండడంతో ఆయా శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభావం పడుతోంది. సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోకపోవడంతో వారు తరచూ డుమ్మా కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు పరిస్థితి ఉందని ప్రజలు, ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మండలంలోని చినమానపురం గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా ఈనెల 8న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం విజయనగరంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. పండగను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బొండపల్లి జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి



గొట్లాం హెల్త్ వెల్‌నెస్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

బొండపల్లి: హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.వి.రమణకుమారి అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం చుట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉన్నట్లు గుర్తించిన ఆమె వెంటనే శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం వైద్య సేవలపై పలు సూచనలు చేశారు.

మాదకద్రవ్యాల తరలింపుపై నిఘా

కొత్తవలస: గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా కట్టుదిట్టం చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. మండలంలోని తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఎస్సై బొడ్డు దేవి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అవయవదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): నేత్ర, అవయవదానంతో ఎంతోమంది చీకటి జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయని మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు అన్నారు. గరివిడి మండలం దుమ్మేద గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో ఉపాధిహామీ వేతనదారులకు నేత్ర, అవయవదానంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మరణానంతరం ఎంతో విలువైన అవయవాలను మట్టిలో కలిసిపోకుండా ఇంకొకరికి దానం చేయటం ద్వారా మరొకరికి జీవితాన్ని ప్రసాదించినట్లువుతుందన్నారు. అవయవ దానంపై ప్రజలు అపోహలు వీడి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమం.. అదే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీరనారాయణం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై గ్రామస్తుల వద్ద ఆరా తీశారు. సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటా సంతోషాలు నింపిన జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, వీరనారాయణం సర్పంచ్ మమ్ములూరి సరోజిని, ఎంపీటీసీ బోజంకి వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ మెరపుల పురుషోత్తం నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, పార్టీ నాయకులు వాకాడ రాంబాబు, కె.అప్పయ్య, మజ్జి శేఖర్, కె.జయశంకర్, స్థానిక నాయకులు మమ్ములూరి సోంబాబు, బోజంకి గోవింద తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారాలు



లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గరివిడి మండలంలో కోడూరు పంచాయతీ పరిధి వాల్లేపేట, రిక్షా కాలనీ, వైఎస్సార్ కాలనీలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే..అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందేవికాదన్నారు. ప్రజలంతా జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, వెదుళ్లవలస సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, అలమండ అప్పలనాయుడు, స్థానిక నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, గవిడి సన్యాసి, గవిడి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గార తవుడు

గజపతినగరం రూరల్: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ గార తవుడు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లిలో శనివారం రైతుభరోసా కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. మండలంలో ఉన్న ప్రతీ రైతు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బెల్లాన త్రినాథరావు, ఏట ధనలక్ష్మి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో పాటు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా చేపట్టే పనులకు ఇసుక, సిమెంట్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి




హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

బొండపల్లి: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణదారులకు ఇసుక, సిమెంట్ కొరత లేకుండా చూడాలని, నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వేదవతి, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, హౌసింగ్ ఏఈఈ రమణరాజు, ఏపీఓ కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

వేపాడ: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీపీ సత్యవంతుడు అన్నారు. స్థానిక ఐకేపీ భవనంలో హౌసింగ్ లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. నిర్మాణంలో జాప్యంపై ఆరా తీశారు. లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అవసరమైతే ఐకేపీలో రుణసదుపాయం అందిస్తామని, వారితో నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఎంపీడీఓ పట్నాయక్, హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, గ్రామపెద్దలు మిరపాక రమణ, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

రాజీతో ఇరువర్గాలకు ప్రయోజనం



పోలీసులు, న్యాయవాదులకు సూచనలు చేస్తున్న జడ్జి విజయ్‌చంద్ర

కొత్తవలస: కేసుల పేరుతో ఏళ్ల తరడబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకునే బదులు జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు ప్రయోజనం ఉంటుందని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం కొత్తవలస, వేపాడ, ఎల్.కోట పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజీకి అవకాశం ఉన్న కేసుల కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

బొండపల్లి: గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా సఖీ గ్రూపు సభ్యులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సఖీ గ్రూపుల ప్రతినిధులతో సమావేశమై చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు, కౌమార బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కులు, సంరక్షణ చట్టాలుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సత్యనారాయణ, ఝూన్సి, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యంతో రైతులకు మేలు

వేపాడ: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందు, తుంపర సేద్యంతో పంటలు సాగుచేయటం వల్ల తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి పి.ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెల్దాం గ్రామంలో రాయితీపై అందించిన బిందుసేద్యం పరికరాలను, సాగుచేస్తున్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, తుంపర, బిందు సేద్యంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు డ్రిప్ ఇరిగేషన్ వినియోగించుకోవాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 9 నుంచి 25 వరకు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75/–, బీసీ, ఓసీలు రూ.150/– చొప్పున రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని సూచించారు. జూన్ 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

చీపురుపల్లి: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి ఎ.బుచ్చింనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతీ రోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నీతి కథలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, చిత్రలేఖనం, క్యారమ్స్, చదరంగం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కర్లాంలో 'గడపగడపకు..'

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో ఈ నెల 8న సాయంత్రం 5 గంటల నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పదిలో 'అభ్యాస్' విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని అభ్యాస్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థిని ఐ.నిహారిక 590 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం.నిషిత 587 మార్కులు, ఎం.భువనకృతి 581, ఎస్.భవ్య సంహిత 581, సీహెచ్.సాయిసాత్విక్ 581 మార్కులతో తరువాత స్థానంలో నిలిచారు.

అట్రాసిటీ కేసు విచారణ

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామానికి చెందిన దళితుడుని అదే గ్రామానికి చెందిన ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషించడంతో పాటు, తనపై దాడి చేసినట్లు దళితుడు చేసిన ఫిర్యాదు చేశాడు. దీనిపై విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు శనివారం గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. దండా జగన్నాథం ఆవులు మేపేందుకు గ్రామంలోని మామిడితోటకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన గొర్లె సత్యరావు, పల్లి సన్యాసిరావు తనపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు బాధితుడు పిర్యాదు చేశాడు. ఈమేరకు ప్రత్యక్ష సాక్షులతో పాటు ఫిర్యాదుదారుడిని విచారించి వివరాలు సేకరించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

చీపురుపల్లి రూరల్(గరివిడి): రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సీఐ జి.సంజీవరావు సూచించారు. గరివిడి పట్టణంలోని బ్రిడ్జి డౌన్‌లో ఎస్సై ఎల్.దామోదరరావుతో కలిసి ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో ఏదైనా ప్రమాదం జరిగి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు మృతి చెందితే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా నడపాలని సూచించారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

శాఖల పనితీరుపై సమీక్ష

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. అన్ని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షేమ పాలనలో ఏపీ దేశానికే ఆదర్శం



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ పాలనలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గాదెలమర్రివలసలో శనివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా.. లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి సంక్షేమ పథకాలను అందించకుండా..ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. టీడీపీ నేతల మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని కోరారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ లబ్ధిపత్రాలు అందజేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దారు గిరిధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతి, పీఆర్ ఏఈ హరికృష్ణ, స్థానిక సర్పంచ్ అట్టాడ దేవ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నేరేల్ల నారాయణరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుర్ల: జమ్ము గ్రామంలోని ఆర్‌బీకే వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. జిల్లాలో అవసరమైనా చోట మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, జమ్ముపేట సొసైటీ అధ్యక్షుడు కురుమునెల్లి శ్రీనివాసరావు, జమ్ముపేట సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అలాగే వ్యక్తి గత ఆరోగ్య పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ సత్యవంతుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో శనివారం సఖీ గ్రూపులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సఖీ గ్రూపుల ఆవశ్యకతను వివరించారు. కిశోరీ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం దిశా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న లక్ష్యంతో మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ పట్నాయక్, తహసీల్దారు కృష్ణంరాజు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి శారదాదేవి

లక్కవరపుకోట: మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.శారదాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ భవనంలో మండలస్థాయి అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం శనివారం నిర్వహించారు. వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అలాగే గ్రామాల్లో మహిళా పోలీస్‌లు నిర్వహిస్తున్న సఖీ గ్రూపుల పనితీరుపై సమిక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పదిలో ప్రభుత్వ పాఠశాలల సత్తా..



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. గరివిడి మండలంలోని కేజీబీవీలో 40 మంది విద్యార్థినులకు గాను 31 మంది ఉత్తీర్ణత సాధించారు. కెఎల్ పురం ఉన్నత పాఠశాలలో 26 మందికి 17 మంది, కోనూరు ఉన్నత పాఠశాలలో 74 మందికి 60 మంది, గరివిడి ఉన్నత పాఠశాలలో 93 మందికి 64 మంది, తోండ్రంగి ఉన్నత పాఠశాలలో 80 మందికి గాను 61 మంది, కొండపాలేం ఉన్నత పాఠశాలలో 68 మందికి గాను 37 మంది, దేవాడ ఉన్నత పాఠశాలలో 27 మందికి 19 మంది, శివరాం ఉన్నత పాఠశాలలో 56 మందికి గాను 46 మంది, వెదుళ్లవలస ఉన్నత పాఠశాలలో 32 మందికి 24 మంది, కాపుశంబాం ఉన్నత పాఠశాలలో 32 మందికి 24 మంది, తాటిగూడ ఉన్నత పాఠశాలలో 19 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించారు.

- చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 242 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 168 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికోన్నత పాఠశాలలో 139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 119 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కర్లాం జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 49 మంది పరీక్షలు రాయగా 43 మంది పాసయ్యారు. మెట్టపల్లి ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 104 మంది ఉత్తీర్ణత సాధించారు. పెదనడిపల్లి ఉన్నత పాఠశాలలో 120 మంది పరీక్షలకు హాజరవ్వగా 91 మంది ఉత్తీర్ణులయ్యారు. పేరిపి ఉన్నత పాఠశాలలో 30 మందికి 20 మంది పాసయ్యారు.
- గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 95 మంది పరీక్షలు రాయగా 95 మంది పాసయ్యారు.
- బొండపల్లి: మండలంలో 8 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక కేజీబీవీ నుంచి 437 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, వారిలో 320 మంది ఉత్తీర్ణత సాధించారు.
- కొత్తవలస: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 8 ప్రభుత్వ పాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ జి.శ్రీదేవి తెలిపారు. మండలంలో 574 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 442 మంది ఉతీర్ణత సాధించారు.
- శృంగవరపుకోట: మండలంలో 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 555 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. వారిలో 443 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ పి.సత్యనారాయణ తెలిపారు.
- జామి: కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 168 మంది పరీక్షలకు హాజరుకాగ 155 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి తెలిపారు. జామి జెడ్పీహెచ్‌ఎస్‌లో 82.5%, అలమండ బాలుర ఉన్నత పాఠశాలలో 87.5% ఉత్తీర్ణత నమోదైంది. అలమండ బాలికల ఉన్నత పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. కుమరాం కేజీబీవీలో 93%, లొట్లపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో 76.2% మంది, విజినిగిరి ఉన్నత పాఠశాలలో 88.7% మంది ఉత్తీర్ణత సాధించారు.
- గజపతినగరం: జిన్నాం హైస్కూల్ 82 శాతం ఉత్తీర్ణతతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. 75 శాతం ఉత్తీర్ణతతో గజపతినగరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మరుపల్లి కేజీబీవీ ద్వితీయ స్థానంలో నిలిచాయి. మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్(70శాతం), లోగీశ ఉన్నత పాఠశాల 64శాతం, గంగచోళ్లపెంట జడ్పీ హైస్కూల్‌లో 59 శాతం, మరుపల్లి హైస్కూల్ 57.8శాతం, గజపతినగరం బాలుర హైస్కూల్ 81శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్ 98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి 100 మంది పరీక్షలకు హారుకాగా 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. భైరీపురం ఉన్నత పాఠశాల నుంచి 92 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 73 మంది ఉత్తీర్ణులయ్యారు. బిళ్లవలస జెడ్పీ పాఠశాల నుంచి 76 మంది పరీక్షలు రాయగా 58 మంది ఉత్తీర్ణులయ్యారు. మెరకముడిదాం కేజీబీవీ నుంచి 45 మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 22 మంది ఉత్తీర్ణులయ్యారు.
- దత్తిరాజేరు: మండలం నుంచి 525 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో 400 మంది ఉత్తీర్ణులయ్యారు. 76.01 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- వేపాడ: పదో తరగతి ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 58.89 శాతం ఉత్తీర్ణత సాధించారు. చినగుడిపాల మోడల్ స్కూల్ విద్యార్థి బోజంకి రవీంద్ర అత్యధిక మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు.
- లక్కవరపుకోట: 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటారు. మండలంలో 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి 481 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 411 మంది ఉతీర్ణత సాధించినట్లు ఎంఈఓ సీహెచ్.కూర్మారావు తెలిపారు.